ఈనాడు
మంచిర్యాల
శనివారం సెప్టెంబరు 28, 2024

దార్శనికుడు కొండా లక్ష్మణ్ బాపూజీ



లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, పద్మశాలీ సంఘం నాయకులు

ఏసీసీ, న్యూస్‌టుడే : స్వాతంత్ర్యోద్యమం, నిజాం నిరంకుశ పాలన, తెలంగాణ సాధన ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్ప దార్శనికుడని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకొని నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికారులు, పద్మశాలీ సంఘం నాయకులతో కలిసి లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహనీయుడి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, జిల్లా కేంద్రంలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర పద్మశాలీ సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, పద్మశాలీ సంఘం నాయకులు సదానందం, యోగేశ్వర్, సుదర్శన్, సుధాకర్, మల్లికార్జున్, రమేష్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బెటాలియన్‌ను సందర్శించిన అదనపు డీజీపీ



పోలీసు పటాలంలో బ్యారెక్‌ను పరిశీలిస్తున్న పటాలాల అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్

హాజీపూర్, న్యూస్‌టుడే: హాజీపూర్ మండలం గుడిపేటలోని 13వ పోలీసు పటాలాన్ని శుక్రవారం రాష్ట్ర పటాలాల అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పటాలంలోని వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. బ్యారెక్‌లు, ఆసుపత్రి, మెస్, గార్డెన్‌లతో పాటు నిర్మాణంలో ఉన్న ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించారు. పనులు వెంటనే పూర్తిచేసి వినియోగంలోకి తేవాలన్నారు. సిబ్బంది, అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్‌కు పోలీసు కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్, పటాలం కమాండెంట్ వెంకటరాములు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

జోనల్ స్థాయి పోటీలకు సై..

నిర్వహణకు జిల్లా ఎస్‌జీఎఫ్ సిద్ధం



రామకృష్ణాపూర్‌లో వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఈ ఏడాది నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు నెలలుగా జిల్లా స్థాయిలో జిల్లావ్యాప్తంగా 30 రకాలకుపైగా ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహించి ఆయా ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక చేశారు. ఇక జోనల్ స్థాయి సంబరం మొదలుకానుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి పోటీలు కాగా మంచిర్యాల జిల్లాలో పది పోటీలు జరగనున్నాయి. ఇందుకు ఇక్కడి ఎస్‌జీఎఫ్ సన్నాహాలు చేస్తోంది. జిల్లా స్థాయి మాదిరి జోనల్ పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఎస్‌జీఎఫ్ జిల్లా శాఖ సిద్ధమవుతోంది. జోనల్‌లో పతిభ చాటే క్రీడా నిర్వా... ఇక జిల్లాకు అవకాశం ఇవ్వగా రాష్ట్ర స్థాయి పోటీలు సైతం మూడు, నాలుగు రకాల పోటీలకు జిల్లా ఆతిథ్యమివ్వనుందని తెలుస్తోంది. మరో నెలపాటు రోజులు ఈ క్రీడా సంబరాలు జిల్లాలో కొనసాగనుండగా ఇక్కడి క్రీడాభిమానులకు కనువిందు చేయనున్నాయి.

విజయవంతంగా నిర్వహిస్తాం

ఫణిరాజా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

ముఖ్యంగా జిల్లా స్థాయి పోటీలను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాం. ఇందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వ్యాయామ ఉపాధ్యాయులు సహకరించారు. జోనల్ స్థాయిని సైతం ఇదే స్ఫూర్తితో వారి చొరవతో ఏర్పాటు చేస్తాం. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వెలికితీసి రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తాం.

జిల్లాలో జరగనున్న బాలబాలికలకు ఎస్‌జీఎఫ్ జోనల్(ఉమ్మడిజిల్లా) స్థాయి పోటీల వివరాలు..

క్రీడ	వయసు	వేదిక
బాస్కెట్‌బాల్	అండర్-14, 17	కార్మెల్ పాఠశాల, మంచిర్యాల
చదరంగం	అండర్-14, 17	లిటిల్‌ఫ్లవర్ పాఠశాల, మందమర్రి
రెజ్లింగ్	అండర్-14, 17	మదర్‌థెరిసా పాఠశాల, లక్సెట్టిపేట
ఫుట్‌బాల్	అండర్-14, 17	హెవెన్ ఆఫ్ హోప్ పాఠశాల, బొక్కలగుట్ట
కరాటే	అండర్-14, 17	ఆదిత్య పాఠశాల, శ్రీరాంపూర్, నస్పూర్
వాలీబాల్	అండర్- 14	జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల, తాళ్లపేట
సాఫ్ట్‌బాల్	అండర్- 17	ప్రభుత్వ పాఠశాల, బెల్లంపల్లి
త్రైకాండో	అండర్-14, 17	ప్రభుత్వ పాఠశాల, చెన్నూరు
ఫెన్సింగ్	అండర్-14, 17	ప్రభుత్వ పాఠశాల, చెన్నూరు

ఎంపీడీవో, ఎంపీవోల ఆకస్మిక బదిలీ

హాజీపూర్ : హాజీపూర్ మండల ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డిలు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ ముగిసిన అనంతరం వీరిద్దరూ అధికారులు ఏకకాలంలో ఒక్కసారిగా బదిలీకావడం పలు అనుమానాలకు తావిస్తోంది. హాజీపూర్ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన మధుసూదన్‌ను బీమారం బదిలీ చేయగా ఆయన స్థానంలో దండేపల్లి మండల ఎంపీడీవో ప్రసాద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డిని వేమనపల్లి మండలానికి బదిలీ చేయగా ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు.

యువతకు ఉపాధి..

● మారుమూల ప్రాంతాలకు చేరిన ఈ-కామర్స్

పల్లెకు విస్తృతి



ఉమ్మడి జిల్లాలో నిత్యం ఆన్‌లైన్ వ్యాపారం తీరిలా..

- ఆర్డర్లు 2500
- సగటున కొనుగోళ్ల లావాదేవీలు రూ. 25 లక్షలు
- పండగ వేళల్లో రూ.50 లక్షలు
- ఉపాధి పొందుతున్న వారు 250
- ఆన్‌లైన్ కొరియర్ సంస్థలు 12

చెన్నూరు,న్యూస్‌టుడే:

ఉమ్మడి ఆదిలాబాద్ అనగానే అడవుల జిల్లా అని పేరు. కానీ ఇక్కడి మారుమూల పల్లెలకు సైతం ఆన్‌లైన్ వ్యాపారం విస్తరించింది. ఇంటి నుంచే ఆర్డర్ నమోదు చేయగానే తమకు నచ్చిన వస్తువు చేరుతుంది. దీని ద్వారా యువతకు ఉపాధి లభిస్తోంది. పల్లెలకు పాకిన ఈ-కామర్స్ సంస్థల విస్తృతిపై కథనం.



✸ మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఘనుకోట విశ్వేశ్వర్ తనకు అవసరమైన గృహోపకరణాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశారు. దాన్ని అతడి ఇంటి వద్దకు వెళ్లి ఈకామర్స్ సంస్థలో పనిచేస్తున్న యువకుడు జగదీశ్ అందజేశారు. మారుమూల గ్రామాల యువత, మహిళలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తూ తమకు నచ్చిన వస్తువులను తెప్పించుకుంటున్నారు.



✸ చెన్నూరు పట్టణానికి చెందిన అభిరామ్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల అనంతరం, సెలవు దినాల్లో ఆయన ఓ సంస్థలో కొరియర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికులు ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు చేసినవి స్టాక్ పాయింట్ వద్దకు చేరుకోగా అక్కడి నుంచి వారి ఇళ్లకు వస్తువులను చేరవేస్తూ నెలకు రూ.12000 వరకు ఆదాయం పొందుతున్నాడు.

ఆన్‌లైన్‌లలో ఎక్కువగా కొనుగోలు చేస్తున్న వస్తువులివీ..
- ఆహార పదార్థాలు
- నిత్యావసరాలు
- ఎలక్ట్రానిక్ ఉపకరణాలు
- దుస్తులు, ఫ్యాషన్ సామగ్రి

పెన్ను, పుస్తకం మొదలు.. ల్యాప్‌టాప్‌ల వరకు ఇంట్లో అవసరమైన అన్ని వస్తువులు.. వ్యాపారాల నిర్వహణకు ఉపకరించే సామగ్రి.. గృహోపకరణ, వస్త్ర, యంత్ర, సాంకేతిక సామగ్రి కొనుగోలుకు వివిధ ఈ-కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఆ సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు వెలిశాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. దీంతో స్థానిక యువతకు ఉపాధి లభిస్తోంది. నిర్వాహకులు ద్విచక్ర వాహనాలు ఉన్న వారిని నియమించుకుంటున్నారు. నేరుగా వినియోగదారులకు అందిస్తున్నారు.


యువత, విద్యావంతులు, మహిళలు, వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు ప్రస్తుతం ఈ-కొనుగోళ్ల విధానం వైపు మొగ్గుచూపుతున్నారు. అధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగపడే ప్రతి వస్తువు కొనుగోలు చేస్తున్నారు. నిత్యావసర సరకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంట్లో గృహోపకరణాలకు అవసరమైనవన్నీ ఆర్డర్ చేసేస్తున్నారు.


వెలసిన ఏజెన్సీలు



జిల్లా కేంద్రాల్లో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు కొనసాగుతున్నాయి. 20 సంస్థలకు అనుబంధంగా శాఖల వారీగా సేవలు అందుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30 రకాల ఆన్‌లైన్ సంస్థలు ఉన్నాయి. ప్రధాన పట్టణాలైన ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల తదితర పట్టణాల్లో ఈ సంస్థలు అందుబాటులో ఉన్నాయి. స్టాక్ పాయింట్ నుంచి వీటిని ఆర్డర్ చేసిన వారి ఇళ్లకు చేరవేస్తూ పలువురు నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లపై జిల్లాలో 100 మంది యువతతో 'న్యూస్‌టుడే' నిర్వహించిన సర్వే వివరాలు ఇలా..





అనుకోని వర్షం.. ఆదుకున్న వంతెన

అప్పటి వరకు మండే ఎండ.. ఉన్నట్టుండి కమ్మేసుకున్న మేఘాలు.. అకస్మాత్తుగా వర్షం.. కొన్ని నిమిషాల్లోనే జరిగిన ఈ పరిస్థితి రేషన్ బియ్యం లారీకి చిక్కులు తెచ్చేలా చేసింది. ఓ లారీ బియ్యం బస్తాల లోడుతో తాండూరు మండల పరిధిలోని రేషన్ దుకాణాల్లో బియ్యం సరఫరా చేస్తోంది. అప్పటి వరకు ఎండగానే ఉండడం కొద్దిపాటి దూరంలోనే దుకాణాలు ఉండటంతో లారీలోని బియ్యం బస్తాలు తడవకుండా ఉండే టార్పాలిన్ కవరును తీసేశారు. లారీ ఐబీకి చేరుకోగానే అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. దీంతో చేసేదేమీ లేక లారీ చోదకుడు చాకచక్యంగా వ్యవహరించి జాతీయ రహదారి వంతెన కింద నిలిపి బియ్యం బస్తాలు తడిచిపోకుండా చూశారు.

- తాండూరు, న్యూస్‌టుడే



ఐబీ చౌరస్తాలో జాతీయ రహదారి వంతెన కింద నిలిపిన రేషన్ బియ్యం లారీ

ఆకట్టుకున్న సైన్స్ డ్రామా పోటీలు



ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: సైన్సుపై మక్కువ పెంచేలా సమాజంలోని సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్సు డ్రామా పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లా కేంద్రంలోని సైన్సు కేంద్రంలోని జరిగిన ఈ కార్యక్రమానికి పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'మానవ జాతి ప్రయోజనం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' అంశంపై జరిగిన పోటీల్లో పాటలు, నాటక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. డీఈవో యాదయ్య, సైన్సు అధికారి మధుబాబు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి విజ్ఞాన ప్రదర్శనలు తిలకించారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు అక్టోబరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు సైన్స్ అధికారి మధుబాబు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఈవో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వై.సత్యనారాయణ, ఎం.దత్తకుమార్, కొండు జనార్దన్, సి.శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, అర్చనలు వ్యవహరించారు.



విద్యార్థుల ప్రదర్శన

విజేతలు వీరే..

నాటిక ప్రదర్శనలో....
ప్రథమ: తెలంగాణ ఆదర్శ పాఠశాల, కాసిపేట
ద్వితీయ: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, సబ్బెపల్లి, హాజీపూర్



గేట్లు ఎత్తడంతో జలాశయం వద్ద జలసవ్వడి

ఎల్లంపల్లికి వరద పోటు

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: ఎల్లంపల్లి జలాశయానికి ఎగువ నుంచి వరద పోటెత్తుతోంది. పరీవాహక ప్రాంతాలతో పాటు ఎస్సారెస్పీ నుంచి పెద్ద ఎత్తున జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ఎల్లంపల్లి పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. గత వారం రోజులుగా అంతే స్థాయిలో నీటి నిల్వను అధికారులు కొనసాగించారు. ప్రస్తుతం జలాశయంలోకి పరీవాహక ప్రాంతాల నుంచి 1,55,662 క్యూసెక్కుల వరద వస్తుండటంతో 16 గేట్లు ఎత్తి 1,63,345 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 81,224 క్యూసెక్కుల వరద వస్తుండగా, పరీవాహక ప్రాంతాల నుంచి 74,398 క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరుతోంది. జలాశయంలో ఔట్ ఫ్లో పెరగడంతో జలాశయంలో ప్రస్తుతం 19.92 టీఎంసీలు నిల్వ ఉంది.

ఎరువుల దుకాణాల్లో రిజిష్టర్ల పరిశీలన

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : చెన్నూరు మండలంలోని అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట, అస్నాద్, ఒత్కులపల్లి గ్రామాల్లోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారిణి కల్పన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో ఎరువుల విక్రయాలకు సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించి డీలర్లకు తగు సూచనలు, సలహాలను అందజేశారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులను అందజేయాలని, పీవోఎస్ మిషన్ ద్వారానే విక్రయాలను జరపాలని ఆదేశించారు. స్టాక్ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ పాల్గొన్నారు.



కిష్టంపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో కల్పన

అసైన్డ్ భూముల్లోని నిర్మాణదారుల అభిప్రాయాల సేకరణ

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలోని సర్వే నెంబరు 840లోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లోని నిర్మాణదారులతో శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్‌శాఖల అధికారులు విచారణ జరిపారు. సదరు భూముల్లో నిర్మాణాలు చేపట్టిన 34 మందికి ఇది వరకే రెండు పర్యాయాలు నోటీసులు జారీ చేసిన అధికారులు అసైన్డ్ భూముల్లోని స్థలాలను ఏవిధంగా కొనుగోలు చేశారు, అందులో నిర్మాణ అనుమతులు, ఇంటి నెంబర్లు ఎలా తీసుకున్నారనే అంశాలపై శుక్రవారం ఒక్కొక్కరిని విచారించి వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు. 34 మందిలో 23 మంది యజమానులు మాత్రమే విచారణకు హాజరు కాగా వారి వద్ద ఉన్న ధ్రువపత్రాలను స్వీకరించారు. మిగతా వారి నుంచి కూడా త్వరలోనే అభిప్రాయాలను సేకరించనున్నట్లు పురపాలిక కమిషనర్ గంగాధర్, తహసీల్దారు మల్లికార్జున్ తెలిపారు. సేకరించిన అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మాణదారుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్న కమిషనర్ గంగాధర్, రెవెన్యూ అధికారులు

సన్నాలే మిన్నంటూ..

● పెరిగిన వరి సాగుతో అన్నదాతకు గిట్టుబాటు
● ఉమ్మడి జిల్లాలో రూ.191.50 కోట్ల మేర ప్రయోజనం

నిర్మల్, న్యూస్‌టుడే:

ప్రస్తుత వానాకాలం నుంచే సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సన్నాలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర దక్కనుంది. సాగు ప్రారంభంలో సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో గతంతో పోలిస్తే ఈ సారి సాగు పెరిగింది. ఒక వేళ సన్నాలను వ్యాపారులు అంతకంటే ఎక్కువ ధరకే కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో రెండు రకాలుగా రైతులకు మేలు జరగనుంది. దీంతోపాటు అర్హులైన తెల్లరేషన్ కార్డులున్న లబ్ధిదారులకు సన్న బియ్యం ఇస్తామని చెబుతుండటంతో అటు రైతులకు ఇటు సామాన్య ప్రజలకు ప్రయోజనం జరగనుంది.



లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ సమీపంలో సాగులో ఉన్న సన్నరకం వరి

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరతో సంబంధం లేకుండా వ్యాపారులు సన్నాలను కొనుగోలు చేస్తుండటంతో మద్దతు అంతంతమాత్రంగా ఉంటోంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈ సారి సన్నాల సాగు అంచనాలను మించి పెరిగింది. ప్రభుత్వ సూచనల మేరకు 2021లో దొడ్డు రకాలను తగ్గించి సన్నాలతోపాటు మొక్కజొన్న, పప్పు దినుసులను అధికంగా సాగు చేశారు. సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు దిగుబడి బాగా వచ్చింది. అయితే సన్నాలను కొనేవారు లేకపోవడం, ప్రభుత్వం దొడ్డు రకాలను మాత్రమే కొనుగోలు చేయడంతో సన్నరకం రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ సారి సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో గిట్టుబాటు దక్కనుంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ.2,320 'బి' రకానికి రూ.2,300 ధర ఉంది. దీంతోపాటు రూ.500 బోనస్ కలిపితే 'ఏ' రకానికి రూ.2,820, 'బి' రకానికి రూ.2,800 దక్కనుంది.

ఉమ్మడి జిల్లాలో 3.48 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఇందులో సన్నరకాలు 1,91,500 ఎకరాల్లో పండిస్తుండగా.. మిగతా 1,56,500 ఎకరాల్లో దొడ్డురకం సాగు చేస్తున్నారు. సన్నరకం ధాన్యం ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున ఉమ్మడి జిల్లాలో 38.30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సన్నరకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సన్నరకాలు పండించిన అన్నదాతలకు అదనంగా రూ.191.50 కోట్ల మేర మేలు జరగనుంది. ఉమ్మడి జిల్లాలో సన్న, దొడ్డురకాల ధాన్యం కొనుగోలుకు 608 కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఒక కేంద్రంలో సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేసేందుకు వేర్వేరు కాంటాలు సిద్ధం చేస్తున్నారు.

రేషన్ లబ్ధిదారులకు ప్రయోజనం

ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులతోపాటు కొత్తగా పొందే రేషన్‌కార్డు లబ్ధిదారులకు వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. దీనివల్ల కార్డుదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు దొడ్డు బియ్యమే ఇస్తుండగా వీటిని చాలా మంది తినకుండా అమ్ముకుంటున్నారు. బయట సన్నాలను కిలో రూ.50 వరకు కొనుగోలు చేయడంతో ఆర్థికంగా ఇబ్బందిగా మారింది. ఇది అమలైతే పేదలకు తక్కువ ధరకు సన్నబియ్యం అందనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు వివరాలు (ఎకరాల్లో)

● జిల్లా ● సన్నరకం ● దొడ్డురకం ● మొత్తం

జిల్లా	సన్నరకం	దొడ్డురకం	మొత్తం
నిర్మల్	70,000	60,000	1,30,000
మంచిర్యాల	90,000	70,000	1,60,000
ఆదిలాబాద్	1,500	500	2,000
కుమురంభీం	30,000	26,000	56,000

జిమ్‌లలో తనిఖీలు

మంచిర్యాల నేరవిభాగం: యువత ఆరోగ్యం, శారీరక దారుఢ్యం కోసం జిమ్‌లకు వెళ్లాలే తప్ప గొడవలు, ఇతరులను ఇబ్బందులకు గురిచేసేందుకు కాదని పట్టణ సీఐ బన్సీలాల్ పేర్కొన్నారు. ఇటీవల పట్టణంలో పలు వర్గాల మధ్య జరిగిన దాడులలో జిమ్‌లకు వెళ్తున్న వారే ఎక్కువగా ఉంటుండటంతో శుక్రవారం ఆయన జిమ్‌లను పరిశీలించారు.

తలసీమియా బాధితులకు వరం



- దేశీయంగా 'ఇన్‌ఫ్యూజ్ థల పంపు' అందుబాటులోకి..
- ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో ఉచితంగా అందిస్తే ప్రయోజనం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం : కొత్తగా అందుబాటులోకి వచ్చిన 'థల పంపు' సికిల్‌సెల్, తలసీమియా బాధితుల కెంతో ఉపయోగకరంగా మారనుంది. రక్తహీనతకు గురై తరచూ రక్తం ఎక్కించుకునే బాధితుల శరీరంలో అవసరానికి మించి పేరుకుపోయే ఐరన్‌ను తగ్గించటానికి ఇచ్చే సూది మందును వేయించుకోవటానికి ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంది. ఈ సూది మందును బాధితులకు సెలైన్‌లో కలిపి ఇస్తుంటారు. ఇలా ఇచ్చేటప్పుడు వారు పడకపై కనీసం 8 గంటల వరకు పడుకోవాల్సి వస్తుంది. కానీ థలపంపు ద్వారా ఆ ఇంజెక్షన్ తీసుకుంటే గంటల తరబడి పడకపై ఉండాల్సిన అవసరం లేకుండా ఉంటుంది. పంపు బెల్ట్‌ను శరీరంపై అమర్చుకొని సాధారణ పనులు చేసుకోవచ్చు. నిర్ణీత సమయం పాటు ఆ సూది మందు చర్మంలోకి చేరిపోతుంటుంది.

ఇన్‌ఫ్యూజ్ థల పంపు ప్రస్తుతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీని విలువ ఆయా కంపెనీలను బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది. నిరుపేద బాధితులు దాన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత కలిగి ఉండరు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా 'మేడ్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్' కింద వైద్య పరికరాలు, ఔషధాల తయారీని ప్రోత్సహిస్తోంది. చెన్నైలోని వి టైటాన్ కార్పొరేషన్ ఇన్‌ఫ్యూజ్ థల పంపును దేశీయంగా తయారు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల తలసీమియా రాష్ట్ర సొసైటీకి ప్రయోగాత్మకంగా పది థల పంపులను ఆ కంపెనీ అందజేసింది. ఆదిలాబాద్ జిల్లాలో మొదటి సారి ముగ్గురు బాధితులకు ఆ కంపెనీ ప్రతినిధులు వాటిని ఎంపీ గోడం నగేష్ చేతుల మీదుగా అందించారు.



బాధితులకు థల పంపును పంపిణీ చేస్తున్న ఎంపీ నగేష్



ఇలా ఇన్‌ఫ్యూజ్ పంపును ఏర్పాటు చేసుకొని సూది మందు తీసుకోవచ్చు

ఉమ్మడి జిల్లాలో బాధితులు ఇలా..	
తలసీమియా :	2021
సికిల్‌సెల్:	565

చాలా సులువు..

ఇన్‌ఫ్యూజ్ పంపు ద్వారా సూది మందు వేసుకోవటం చాలా సులువుగా ఉంటుంది. సూది మందును పంపులో లోడ్ చేసి శరీరంపై ఎక్కడ దాన్ని తీసుకోవాలో అక్కడ ఆ పంపును బెల్ట్ ద్వారా బిగించేస్తే సరి. దానిలో ఏర్పాటు చేసిన సూది ద్వారా చర్మంలోకి నిర్ణీత మోతాదులో ఆ మందు వెళ్లిపోతుంటుంది. ఈ సమయంలో బాధితులు సాధారణ పనులన్నీ చేసుకోవచ్చు.

విధిగా సూది మందు..

తలసీమియా, సికిల్‌సెల్ బాధితులు తరచూ రక్తం ఎక్కించుకోవటం వల్ల వారి శరీరంలో అత్యధికంగా ఐరన్ పేరుకుపోతుంది. శరీరంలోని అవయవాలు వ్యాధులకు గురై మృతి చెందే ప్రమాదం ఉంటుంది. బాధితుల శరీరంలో పేరుకుపోయిన ఐరన్‌ను తొలగించటానికి సూది మందు వేయించుకోవటం అత్యవసరం. ప్రత్యామ్నాయంగా మాత్రలు ఉన్నా వాటితో ఆశించిన ఫలితాలు ఉండవంటున్నారు.

ప్రభుత్వం దృష్టి పెడితే మేలు..

సికిల్‌సెల్, తలసీమియా వ్యాధులు ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్నాయి. ఇన్‌ఫ్యూజ్ పంపు, సూది మందులు మాత్రం అందులో లేవు. దేశీయంగా తయారు చేసిన థల పంపు కొనుగోలు చేయాలంటే రూ.20 వేలు భరించే ఆర్థిక స్తోమత పేద రోగులకు ఉండదు. సూది మందు సైతం బయట మార్కెట్‌లో రూ.200 ఉంటుంది. వీటిని ఆరోగ్యశ్రీలో చేర్చి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తే మేలు చేసిన వారవుతారని బాధితులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధి పనులకు సాయం

తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన పాపయ్య, సుభద్ర దంపతుల మొదటి కుమారుడు చిల్పిప విజయకుమార్. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ, మేనత్తలు మహావాది లక్ష్మీకాంతయ్య, సీతమ్మలు అతడిని దత్తత తీసుకుని పెంచుకున్నారు. అచ్చలాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి, అనంతరం 3 సంవత్సరాలు వేద విద్యను పూర్తి చేశారు. మంథనికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుకున్నారు. కొలువు సాధించి సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన భార్య శీల గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె పేరిట స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అచ్చలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు చేయించారు. పాఠశాలకు 10 గుంటల క్రీడా స్థలం కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీ, గేటు ఏర్పాటు చేయించారు. పాఠశాలలో కార్యక్రమాల నిర్వహణకు ఓ వేదిక నిర్మించారు. తరగతి గదుల పైకప్పు శిథిలావస్థకు చేరడంతో జనప రేకులు వేయించి మరమ్మతులు చేయించారు. బాలికల శౌచాలయాల మరమ్మతులకు రూ.80 వేలు, ల్యాప్‌టాప్, ప్రింటర్‌కు రూ.50 వేలు, ఉపాధ్యాయుల కుర్చీల మరమ్మతులకు రూ.50 వేలు, సైన్స్ పరికరాలు, క్రీడా సామగ్రికి రూ.50 వేలు వివిధ సందర్భాల్లో ఇచ్చారు.



చిల్పిప విజయకుమార్, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి



పాఠశాలలో ఏర్పాటు చేసిన గేటు



అచ్చలాపూర్ పాఠశాలకు ఇచ్చిన ఆట స్థలం

సామాజిక తోవ.. చదువుకున్న బడికి సేవ

తాండూరు, న్యూస్‌టుడే: పుట్టి పెరిగిన ఊరు.. చదువుకున్న బడిని గుర్తుంచుకోవడమే కాదు వీటిని అభివృద్ధి చేయాలి అనుకునే వారు కూడా ఉంటారు. నేటి ఈ పూర్వ విద్యార్థులను చూస్తే అర్థమవుతోంది. వారు చదువుకున్న రోజుల్లో వసతులు లేక పడిన కష్టాలను తమ ఊరి విద్యార్థులు పడకూడదనుకున్నారు. పుట్టి పెరిగిన ఊరి బాగు కోసం.. చిన్ననాడు చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించారీ దాతలు.

ఆటల కోసం స్థలం కొనుగోలు

కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన మాదవరపు సంతోష్‌రావు చిన్నతనంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉన్నత స్థాయిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో రూ.12 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. జన్కాపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఆట స్థలం కోసం 20 గుంటల స్థలాన్ని కొనుగోలు చేసి చుట్టూ ప్రహరీని నిర్మించి గేటు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు ఆట వస్తువులు అందించారు. శుద్ధ జల ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 6 కంప్యూటర్లు అందజేశారు.



జన్కాపూర్ పాఠశాలకు కొనిచ్చి ప్రహరీ ఏర్పాటు చేయించిన ఆట స్థలం



జన్కాపూర్ పాఠశాలలో విద్యార్థులకు అందించిన కంప్యూటర్లు

నిరుద్యోగుల పక్షాన పోరాడతా

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో జరిగే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో తాను ఈసారి బరిలో నిలువనున్నట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలందిస్తూ విద్యావేత్తగా అనుభవం ఉన్న తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటానన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాడేందుకు బలం పెంచే విధంగా ఈ సారి వంద శాతం ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోవద్దని, పట్టభద్రుల్లో చైతన్యం పెంచే లక్ష్యంతో గత 15 రోజుల నుంచి తమ ప్రతినిధులతో ఓటు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన పార్టీనుంచి టికెట్ ఆశిస్తున్నానన్నారు. టికెట్ వస్తే పార్టీ తరపున పోటీ చేస్తానని, లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

తొలిరోజు 30 మంది హాజరు



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2008లో ఎంపికైన బీఎడ్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ఆదిలాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ప్రారంభమైంది. తొలిరోజున మంచిర్యాల, నిర్మల్, కుమురం భీం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి 30 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అక్టోబరు 5వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుందని డీఈవో ప్రణీత తెలిపారు. కమిటీ సభ్యులు సుకుమార్, మహేందర్‌రెడ్డి అభ్యర్థులు పూరించిన పత్రాలతో పాటు ఆయా ధ్రువపత్రాలను పరిశీలించారు.

ఆలయాల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: హిందూ ఆలయాల సంరక్షణ కోసం తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని గన్నవరం భువనేశ్వర మఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామి కోరారు. జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక నటరాజ్‌నగర్‌లోని ఉమామహేశ్వర ఆలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో లడ్డూప్రసాద తయారీలో జరిగిన కల్తీ విషయం ప్రస్తుత హిందూ సమాజాన్ని గాయపర్చిందన్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ తిరుపతి పర్యటనపై అభ్యంతరం వ్యక్తంచేశారు. వ్యక్తిగతంగా క్రైస్తవ మత సిద్ధాంతం ఆచరించే ఆయన నిజాయతీగా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఆచార వ్యవహారాలను దెబ్బతీసే ప్రయత్నం చేయొద్దని, ఓట్ల కోసం హిందువుల్లాగా నటించొద్దని హితవు పలికారు. ఎవరి మతాచారాలు వారివేనని, ఎవరికివారు స్వేచ్ఛగా ఆచరించుకోవచ్చని, అదే సమయంలో అన్నింటినీ గౌరవించాలన్నారు. హిందూ ఆలయాలకు అన్య మతస్థులు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఒకవేళ వెళితే అక్కడి దైవాన్ని నమ్ముతున్నామనే అంగీకారం తెలపాలని సూచించారు. రాజకీయ నాయకత్వం నచ్చితే నాయకులు ఏ మతం వారైనా ఓట్లు వేస్తారని, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం తమ చేతల ద్వారా మతవైషమ్యాలు తీసుకురావొద్దని చెప్పారు. సమావేశంలో విభాగ్ ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పతికె రాజేందర్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, మాతృశక్తి ప్రాంత సహ సంయోజిక సద్ది శ్రీవాణి, జిల్లా సహ సంయోజిక సిరి, నాయకులు చింతకుంట శ్రీనివాస్, పతికె రమేశ్, అయ్యన్నగారి భూమయ్య, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమలానందభారతి స్వామి

ముథోల్(బాసర): బాసర అమ్మవారిని శుక్రవారం కమలానందస్వామి దర్శించుకొన్నారు. వేదపండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి, తదితర పూజలను నిర్వహించారు. భాజపా నాయకులు సతీశ్వర్‌రావు, సుభాష్‌యాదవ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అండర్-19 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటు జీఎం రాజమల్లు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు కామారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. బాలుర విభాగంలో పి.సాయిచరణ్, సీహెచ్.గోపాలశ్రీ కృష్ణ, డి.ప్రేమ్‌దీప్, డి.సిద్ధార్థ, సీహెచ్.నిఖిల్, కె.అక్షిత్, ఏ.అఖిల్, టి.రుద్రధ్రువ, నందం, ఆర్.అక్షయ్, కోచ్‌లుగా కుందారపు నరేష్, మేనజర్‌గా మల్లేష్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. బాలికల విభాగంలో టి.ప్రజ్వల, ఎస్.సాయి శ్రీవర్శిణి, ఎం.సహస్ర, స్ఫూర్తికారుణ్య, డి.వెరొనిక, డి.నవ్య, టి.జాన్సీ, సీహెచ్. లక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. కోచ్‌గా జి.గోపాల్, మేనేజర్‌గా కె.భాస్కర్ వ్యవరించనున్నట్లు పేర్కొన్నారు. వీరికి శనివారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో కోచింగ్ క్యాంపు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శి తిరుపతి, ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, బెల్లంపల్లి ఏరియా పర్సనల్ అధికారి రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, కమిటీ సభ్యులు



వేదికపై రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

రాజయ్య ప్రసంగాన్ని అడ్డుకున్న భారాస ఎమ్మెల్యే

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగాన్ని భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. రాజయ్య మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీతో తనకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇవ్వకపోయి ఉంటే ప్రజలు ఎవరిని తిట్టుకునేవారని? ఇస్తే ఎవరికి లాభం జరగాలి? కానీ ఎవరికి లాభం జరిగింది.. ఎవరు పదవులను అనుభవిస్తున్నారని ప్రశ్నించారు. బాపూజీ అంత్యక్రియలు ఆయన సొంత స్థలం జలసౌదలో నిర్వహించాలని నేను పట్టుబట్టానన్నారు. కొందరు నన్ను భయపెట్టారని అన్నారు. భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆగ్రహంతో ఆయన ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు అనిల్ జాదవ్‌ను ఆపారు. రాజయ్య ప్రసంగాన్ని ముగించే వరకు సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తూ అలాగే నిలబడి ఉన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడాల్సిన సమయం కాదని, సమావేశంలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని అనిల్ జాదవ్ మండిపడ్డారు. నేను భారాస గురించి మాట్లాడటం లేదని రాజయ్య జవాబిచ్చారు. రాజయ్య తన ప్రసంగాన్ని ఆపకపోవటంతో పలువురు పద్మశాలీ సంఘం నాయకులు కల్పించుకొని సమావేశాన్ని ఆపించారు.

విద్యుత్తు శాఖలో బదిలీల విధివిధానాలు విడుదల

మంచిర్యాల సిటీ: ఎట్టకేలకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని విభాగాల బదిలీలకు రంగం సిద్ధమైంది. విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి. జూన్ 30వరకు ఒకేచోట రెండేళ్లు పూర్తిచేసుకున్న వారందరూ బదిలీకి అర్హులే అని అందులో పేర్కొన్నారు. వచ్చేనెల ఏడో తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి కానుంది. జిల్లాలో పాతుకుపోయిన సిబ్బంది, సంఘాల నాయకులు, వారి అనుచరులకు తప్పితే మిగతా వారికి ఉపయోగం అంతంత మాత్రమే అని సంస్థలోని ఉద్యోగుల నుంచే విమర్శలు వస్తున్నాయి. శనివారం సాయంత్రం వరకు బదిలీకి అర్హత ఉన్నవారి వివరాలు అందించాలని ఆదేశాలు రావడంతో ఎస్‌ఈ కార్యాలయ సిబ్బంది అందులో నిమగ్నమయ్యారు.

శభాష్.. శివ!

- యూట్యూబర్‌గా రాణిస్తున్న పల్లెటూరి కుర్రాడు


తెలుగు మాధ్యమంలో చదివిన ఆ పల్లెటూరి కుర్రాడు బీటెక్‌లో చేరగానే ఆంగ్లంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాజెక్టు వర్క్‌లు, ప్రజెంటేషన్లు ఇచ్చే సమయంలో ఆ భాషలో మాట్లాడేందుకు తన లాగే చాలా మంది బాధపడుతున్నారని గుర్తించారు. దీన్ని అధిగమించేందుకు సులువైన మార్గాలను అన్వేషించారు. యానిమేషన్ ద్వారా చెబితే అర్థం చేసుకోవచ్చని భావించి యూట్యూబ్ ద్వారా మూడు భాషల్లో వీడియోలు రూపొందించి ఆంగ్ల పాఠాలు బోధిస్తూ యూట్యూబర్‌గా రాణిస్తున్నారు. -న్యూస్‌టుడే, భైంసా గ్రామీణం





సాధించిన గోల్డెన్ ప్లే బటన్‌తో.. శివ

నిర్మల్ జిల్లా భైంసా మండలం లింగా-1 గ్రామానికి చెందిన గాడేకర్ శివ.. ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసమంతా తెలుగు మాధ్యమంలోనే పూర్తిచేశారు. ఇంజినీరింగ్(సివిల్) ఆంగ్ల మాధ్యమం కావడంతో చేరినప్పటి నుంచి ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ప్రాజెక్టు వర్కులు, ప్రజెంటేషన్లు ఇచ్చే క్రమంలో. ఆంగ్ల భాషను ఎక్కడ, ఎలా నేర్చుకోవాలో తెలియని అయోమయ స్థితి ఎదురైంది. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి తనలాగే సమస్య ఉందని గుర్తించి ఎలాగైనా దీన్ని గట్టెక్కాలని నిర్ణయించుకున్నారు.



గాడేకర్ శివను అభినందిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్

పది లక్షలకు పైగా వీక్షకులు

గూగుల్, యూట్యూబ్‌లను అనుకూలంగా మార్చుకుని మొదట ఆయన ఆంగ్లంపై పట్టు సంపాదించారు. దీని కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారు. యానిమేషన్ (బొమ్మలతో)లో చెబితే చక్కగా అర్థం చేసుకోవచ్చని నిర్ణయానికి వచ్చారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో యానిమేషన్‌లో పాఠాలు రూపొందించి యూట్యూబ్ ఛానల్ 'గాడేకర్ శివ' ద్వారా వీడియోలు పొందుపర్చారు. ఇలా అయిదేళ్లలో 259 వీడియోలు అప్‌లోడ్ చేయగా.. 10,14,000 మంది సబ్‌స్క్రైబర్లుగా (వీక్షకులు) చేరారు. ఈ వీడియోలను 5,84,49,000 మందికి పైగా వీక్షించారు. శివ ప్రతిభను గుర్తించిన యూట్యూబ్ ఇటీవల గోల్డెన్ ప్లేబటన్ (బంగారు పలక) పంపించింది.



శివ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన మూడు భాషల వ్యాఖ్యలు

అరబ్ దేశాల నుంచి ఆదరణ

స్పోకెన్ ఇంగ్లిష్, భాషా నైపుణ్యంపై పాఠాలను కొత్తగా రూపొందిస్తున్నారు. సందర్భానుసారంగా ఆంగ్ల పదాలు, వ్యాఖ్యలు, యానిమేషన్ చిత్రాలతో రూపొందించిన వీడియోలు చక్కటి ఆదరణ పొందుతున్నాయి. వీడియోలకు తానే వ్యాఖ్యానం ఇస్తున్నారు. మొదట తెలుగు, హిందీ, భాషల్లో వీడియోలు చేశారు. అరబ్ దేశాల్లోని వీక్షకులు ఉర్దూలో కావాలని కోరడంతో.. హిందీలో వారికి పంపి ఉర్దూలో తర్జుమా చేయించారు. అలా ఉర్దూలోనూ వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. తన వీడియోల ద్వారా కోటి మంది వీక్షకులను చేర్పించి డైమండ్ ప్లే బటన్ సాధించడమే తన లక్ష్యమని శివ చెబుతున్నారు.

వెలుగులోకి పురాతన భైరవ విగ్రహం

కుంటాల, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కుంటాలలోని ప్రాచీన గ్రామదేవత గజ్జలమ్మ ఆలయానికి తూర్పున సుమారు వంద మీటర్ల దూరంలో క్రీస్తు శకం 6వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూట రాజు చెక్కిన భైరవుని విగ్రహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు తుమ్మల దేవరావ్ తెలిపారు. రాష్ట్రకూటుల కాలంలో ఈ గ్రామం వైభవంగా వెలిగినట్లు ఇక్కడ వెలుగులోకి వచ్చిన విగ్రహాలతో తెలుస్తోంది. భైరవ సంప్రదాయం ఇక్కడ కొనసాగినట్లు ఇక్కడ శిల్పసంపద తేటతెల్లం చేస్తోంది. నిర్మల్ జిల్లా ప్రాంతం రాష్ట్రకూట రాజు 2వ కృష్ణుని ఏలుబడిలో ఉన్నట్లు దిలావర్‌పూర్‌లో వెలుగులోకి వచ్చిన శాసనం వల్ల తెలుస్తోంది. వెలుగులోకి వచ్చిన భైరవ విగ్రహంలో పెద్ద దమ్మిల్లా జటఝూటం, పెద్ద కుండలాలు, కర్ణాభరణాలు, మెడలో హారంతోపాటు కాపాలజంధ్యం, నిజహస్తాల్లో కత్తి, రక్తంతో కూడిన పాత్ర, పరిహస్తాల్లో దండకం డమరుకం ఉన్నాయి. దండకడియాలు, ముంజేతి కంకణాలు, మొలతాడు కలిగి త్రిభంగిమలో వైతస్తిక పాదభంగిమలో ఉన్నాడు. కాళ్లకింద సర్పవాహనం ఉండే అవకాశం ఉంది. కానీ భూమిలో కుంగిపోయి ఉన్నందున వాటిని గుర్తించలేకపోయామని దేవరావ్ వివరించారు. విగ్రహ లక్షణాలు బట్టిచూస్తే అష్ట భైరవుల్లో కాల భైరవునిగా చెప్పొచ్చు. ఇదే కాకుండా 16వ శతాబ్దపు మరో విగ్రహం ఈ ప్రాంతంలో గుర్తించామని, ఆ భైరవుని లక్షణాలు కూడా రాష్ట్రకూట భైరవుని విగ్రహం పోలి ఉన్నాయని పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో చరిత్ర పరిశోధకులు అబ్బిడి రాజేశ్వర్‌రెడ్డి, తుమ్మల సుజాత పాల్గొన్నారు.



కుంటాలలో భైరవ విగ్రహం చూపుతున్న దేవరావు

పకడ్బందీగా వన్యప్రాణుల సంరక్షణ నిబంధనల అమలు

ఏసీసీ, న్యూస్‌టుడే: కవ్వాల్ అభయారణ్యం పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ, అటవీ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అభయారణ్యం పరిధిలో నిబంధనల అమలుపై దండేపల్లి, జన్నారం మండలాల అధికారులతో చర్చించారు. అక్రమ వ్యాపారాలు, నిర్మాణాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పర్యావరణ చట్టం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అభయారణ్యం చుట్టూ కిలోమీటరు మేర ఏకో సెన్సిటివ్ జోన్, 10 కిలోమీటర్ల మేర రేడియస్ జోన్‌లను ఏర్పాటుచేయాలన్నారు. ప్రత్యేక మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతీలాల్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

న్యూస్‌టుడే, నస్పూర్

? నస్పూర్‌లోని 11వ వార్డు పటేల్ కాలనీలో రోడ్డు వెంట మురుగు కాలువలు లేవు. నివాసాల నుంచి వచ్చే మురుగునీరు కాలువలోనే నిలిచి దిగువన ఉన్న అభినవ కాలనీలోకి ప్రవేశిస్తుంది. వర్షాకాలంలో మురుగునీరు, వర్షపు నీరు కాలనీకి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - **స్థానికులు, అభినవ కాలనీ**

✔ ఆ కాలనీని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. - **సతీష్, కమిషనర్, నస్పూర్**

? శ్రీరాంపూర్‌లోని ఆర్కే-6 కొత్త రోడ్ డివైడర్ మధ్యలో చెత్తాచెదారంతో నిండి ఉంది. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెత్త ఉండటంతో పాములకు ఆవాసంగా మారింది. - **స్థానికులు, ఆర్కే-6 కొత్తరోడ్డు**

✔ రెండు రోజుల్లో డివైడర్ మధ్యలో చెత్తాచెదారం తొలగిస్తాం. - **సతీష్, కమిషనర్, నస్పూర్**

న్యూస్‌టుడే, కోటపల్లి

? కోటపల్లి మండలం జనగామలోని పలుకాలనీల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. - **రాజేష్, స్థానికుడు**

✔ దీపాలు వెలగని స్తంభాలను పరిశీలించి నూతన దీపాలు ఏర్పాటు చేస్తాం. - **శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం

? ఇంక్లైన్‌బస్తీలో చెత్తను రోడ్డు పక్కనే వేస్తున్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నాం. - **శ్రీనివాస్**

✔ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి**

? పట్టణంలోని ప్రధాన రోడ్లపై గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. - **రమేష్, బజార్‌ఏరియా**

✔ వినాయక నిమజ్జన సమయంలో గుంతలను పూడ్చాం. మరోసారి రోడ్లకు మరమ్మతులు చేపడతాం. - **శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్**

నేర వార్తలు

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దంపేటకు చెందిన బెడద కార్తీక్ (28) చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెద్దంపేటకు చెందిన బెడద కార్తీక్ కొంతకాలంగా తనకున్న రెండెకరాల భూమితో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటలో రూ.8 లక్షల మేరకు నష్టం రావడంతో అప్పులు చేశాడు. వాటిని తీర్చే స్తోమత లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 14న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కార్తీక్ కొంత కాలంగా చేసిన పత్తి వ్యాపారంలో డబ్బులు పోగొట్టుకోవడంతోనే అప్పుల పాలయ్యాడని పలువురు గ్రామస్థులు తెలిపారు.


కార్తీక్

ఎస్టీపీపీ ఒప్పంద కార్మికుడి బలవన్మరణం

జైపూర్, న్యూస్‌టుడే: సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం (ఎస్టీపీపీ)లో విధుల నిర్వహణకు ఒప్పంద కార్మికుడు పవర్‌మేక్ సంస్థ తనను విధుల్లోకి తీసుకోవడం లేదని మనస్తాపం చెంది పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెగడపల్లికి చెందిన మాసు బాలకృష్ణ(37)-లక్ష్మీ దంపతులకు రిషీంద్ర, నిహాల్ సంతానం. పవర్‌ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోవడంతో కొన్నేళ్లుగా బీవోపీ(బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంట్) హెల్పర్‌గా పని చేస్తున్నాడు. గత సంవత్సరం ఎస్టీపీపీ నుంచి వచ్చే దుమ్ము కారణంగా ఊపిరితిత్తుల్లో ఇబ్బంది వచ్చి ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. ఆ తర్వాత మళ్లీ విధులకు హాజరయ్యాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం మళ్లీ ఇబ్బంది రావడంతో వైద్యుల సలహా మేరకు మందులు వాడి కోలుకున్నాడు. దీంతో తనను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని పవర్‌మేక్ హెచ్‌ఆర్ మధు, రమేష్‌లను కొన్ని రోజుల నుంచి కలువగా వారు నిరాకరించారు. దీంతో గ్రామ పెద్దల ద్వారా నచ్చజెప్పినప్పటికీ వారు స్పందించలేదు. దీంతో ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.


బాలకృష్ణ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హాజీపూర్, న్యూస్‌టుడే: రెండ్రోజుల క్రితం గుడిపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కర్ణమామిడికి చెందిన వడ్డెపల్లి తిరుపతి (41) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కర్ణమామిడికి చెందిన తిరుపతి ఈ నెల 26న రాత్రి ద్విచక్రవాహనంపై మంచిర్యాల నుంచి కర్ణమామిడికి వస్తున్నాడు. గుడిపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న లారీని చీకట్లో గుర్తించకుండా వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తిరుపతి మృతిచెందాడు.


తిరుపతి

మత్తడి ధ్వంసం కేసులో పుర ఛైర్‌పర్సన్ కుమారుడి విచారణ

కాంగ్రెస్ నేతలనూ అదుపులోకి తీసుకున్న పోలీసులు

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు పట్టణంలోని శనిగకుంట చెరువు మత్తడిని పేలుడు పదార్థాలతో ధ్వంసం చేసిన ఘటనలో మరికొంత మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలడంతో ఆ దిశగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. శుక్రవారం తెల్లవారు జామునే చెన్నూరు పట్టణంలోని పలువురి ఇళ్లకు చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడం, అక్కడి నుంచి వారిని జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్‌తో పాటు లక్ష్మణ రాజాపు అనే వ్యక్తుల ఇళ్లకు ఆకస్మికంగా వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అర్చనగిల్డా భర్త రాంలాల్‌గిల్డా ఇంటికి వెళ్లగా అతను అందుబాటులో లేకపోవడంతో అతడి కుమారుడు రోహిత్‌గిల్డాతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీంతో వెనుదిరిగి వెళ్లారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్‌పార్టీ నాయకులతో పాటు పలువురు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నవారికి మద్దతుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఆందోళనకు దిగారు. పోలీసులు అదుపులో ఉన్న వారిని జైపూర్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించి వదిలిపెట్టారు.

గూడెంలో పట్టపగలు దొంగతనం

దండేపల్లి గ్రామీణం: గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ సమీపంలోని మంచు సురేష్ ఇంట్లో శుక్రవారం పట్టపగలు దొంగతనం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దుండగులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను పగులగొట్టి అందులో ఉన్న మూడు తులాల బంగారం, రూ.20 వేలను అపహరించారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.


దండేపల్లిలో..


మంచిర్యాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఆర్.ఉప్పలయ్య


నస్పూర్‌లో..

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

మంచిర్యాల పట్టణం, తాండూరు, శ్రీరాంపూర్ గ్రామీణం, దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జన్నారం, దండేపల్లి, నస్పూర్, కోటపల్లి, ఏసీసీ, లక్సెట్టిపేట, హాజీపూర్, మందమర్రి పట్టణం, జైపూర్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తొలి పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో పద్మశాలీ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కోటపల్లిలో...


శ్రీరాంపూర్‌లో జీఎం బి.సంజీవరెడ్డి


లక్సెట్టిపేటలో..


హాజీపూర్‌లో కమాండెంట్ వెంకటరాములు, సిబ్బంది


మంచిర్యాల బైపాస్ రోడ్డులో..

వయోవృద్ధుల సంరక్షణకు చర్యలు

ఏసీసీ, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం-2007 అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అదనపు కలెక్టర్ మోతీలాల్ పేర్కొన్నారు. అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వృద్ధులతో కలిసి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఓవర్‌బ్రిడ్జి నుంచి ముఖరాం చౌరస్తా వరకు కొనసాగిన ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, సీడీపీవో రేష్మ, చందన, ఎండీ ఫర్జానా బేగం, సౌజన్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

జైపూర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కోటారి రఘు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. 38వ హెచ్‌ఎఫ్‌ఐ (హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో వచ్చే నెల 3, 7వ తేదీలలో సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. రఘు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తుండగా శుక్రవారం ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపల్ కమలాకర్, పీఈటీలు సంతోష్, వెంకటేష్ అభినందించారు.

మార్కెట్‌కు కాకా పేరును వ్యతిరేకిస్తాం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లిలో ప్రారంభమైన కూరగాయల మార్కెట్‌కు దివంగత కాకా వెంకటస్వామి పేరు ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బత్తుల సుదర్శన్, భారాస పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారాస ప్రభుత్వ హయాంలోనే కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తయితే కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. బెల్లంపల్లిలో వంద పడకల ఆసుపత్రిని రూ.17 కోట్లతో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే వినోద్ గెలిచాక ఆసుపత్రి కోసం ఏం చేశారని ప్రశ్నించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులకు కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

చెరువు హద్దుల ఏర్పాటుకు సర్వే

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : మందమర్రి పాతబస్టాండ్‌లోని ఊరు మందమర్రి చెరువు హద్దుల ఏర్పాటుకు శుక్రవారం సర్వే ప్రారంభించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వే చేపట్టారు. ఇరిగేషన్ డీఈ శారద, ఏఈ రమ్య, ఆర్‌ఐ గణపతి రాథోడ్ ఆధ్వర్యంలో చెరువు శిఖం భూమి, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దుల నిర్ధారణకు సర్వే చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మంచిర్యాల న్యాయవిభాగం, ఏసీసీ, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. పలువురు న్యాయమూర్తులతో కలిసి మంచిర్యాల జిల్లా కోర్టు ఆవరణలో చీపురు చేతబట్టి చెత్తాచెదారాన్ని తొలగించారు. న్యాయమూర్తులు అర్పితమారంరెడ్డి, సంపత్, ఉపనిషద్విని, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఎస్‌ఈని కలిసిన 327 సంఘం నూతన కమిటీ

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: తెలంగాణ ట్రాన్స్‌కో విభాగానికి చెందిన ఉద్యోగులు శుక్రవారం ఆయా ఎస్‌ఈ వెంకటేశ్వరరావును పాత మంచిర్యాలలోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ఎన్నికైన 327(ఐన్‌టీయూసీ అనుబంధం)యూనియన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీ ఆయనను సత్కరించారు. సిబ్బంది ఇబ్బందులను పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో 327 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సుదర్శన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేశ్వర్, సురేష్, రాజు, శ్రీనివాస్, వికాస్ రవీందర్ పాల్గొన్నారు.

జిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లా శాఖల సమన్వయంతో మంచిర్యాలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులతో కలిసి సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు.

హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మందమర్రి, రామకృష్ణాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాలక్ష్మీ పథకం సబ్సిడీ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. క్యాతనపల్లిలోని 1, 12వ వార్డుల్లో రూ.14 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఓపెన్‌జిమ్‌కు భూమి పూజ చేశారు.

ఇసుక స్వాధీనం

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని మైలారం శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ప్రసాద్, ఆర్‌ఐ సులోచన, మైనింగ్ అధికారి అశోక్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : మందమర్రి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి కుస్తీ, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ప్రేమరాణి శుక్రవారం తెలిపారు. ఇటీవల లక్సెట్టిపేటలోని జ్యోతిబాపులే గురుకుల కళాశాలలో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో కె.శ్రీజ, వాలీబాల్ పోటీల్లో జె.సంజన, అన్విత పాల్గొని సత్తా చాటినట్లు వివరించారు. వీరిని ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ కృష్ణవేణి, పీడీ సోనియా, పీఈటీ మల్లిక, హౌజ్ మాస్టర్ స్వర్ణలత అభినందించారు.


ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయురాళ్లు

కల్తీ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోండి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్న దుకాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆరిజన్ డైయిరీ సీఏఓ బోడపాటి శేజల్ ఆబ్కారీ శాఖను కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ మద్యం దుకాణంలో మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఆబ్కారీ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. ఎక్కువ ధర ఉన్న మద్యం సీసా మూత తొలగించి, కొంత మద్యాన్ని తీసి, తక్కువ ధర ఉన్న మద్యం, స్పిరిట్, నీళ్లు కలుపుతున్నారని ఆరోపించారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

జన్నారం, కోటపల్లి, న్యూస్‌టుడే : మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి అందిస్తున్న తాగు నీటిపై గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గాజుల వెంకటేశ్ అన్నారు. జన్నారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు నాలుగు రోజుల శిక్షణలో భాగంగా శుక్రవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కోటపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పర్యవేక్షక అధికారి రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ విద్యాసాగర్, ఏఈ బద్రీనాథ్, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

దండేపల్లి : గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా అందరికి తాగు నీరందేలా చూడాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ మధుసూదన్ పేర్కొన్నారు. పథకం నిర్వహణకు ప్రతీ పంచాయతీ నుంచి ఒక సహాయకుడిని నియమించగా వీరికి శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహణపై అవగాహన కల్పించారు.

కుట్టు యంత్రాల పంపిణీలో మోసం

నెన్నెల, న్యూస్‌టుడే: నెన్నెల మండలంలో మదర్ ప్రతిభా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించి రాయితీపై కుట్టు యంత్రాలు పంపిణీ చేస్తామని మోసం చేశారని కుశ్నపల్లి మహిళలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ వద్ద నుంచి 50 శాతం రాయితీపై కుట్టు యంత్రా అందిస్తామని చెప్పి రూ. 4200 వసూలు చేశారని ఆరోపించారు. నాణ్యత లేని యంత్రాలు పంపిణీ చేశారన్నారు. 40 మంది నుంచి డబ్బులు వసూలు చేసి కొంత మందికి మాత్రమే ఇచ్చారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని ఎస్సైని కోరారు..

ఆరుగురి బైండోవర్

నెన్నెల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గంజాయి వినియోగిస్తున్న యువకులపై ఈ నెల 26వ తేదీన కేసు నమోదైంది. దీంతో శుక్రవారం తహసీల్దార్ రమేష్ ముందు ఆరుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

మరో ఇద్దరి రిమాండ్

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 23న స్థానిక బైపాస్‌రోడ్‌లో జరిగిన దాడిలో ప్రధాన నిందితులైన పోచంపల్లి సంపత్, కాతం రమేష్‌లను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి కత్తి, స్టిక్, చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో సంపత్‌పై 8 కేసులు, రమేష్‌పై 5 కేసులు నమోదయ్యాయని, మిగిలినవారిని త్వరలో అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

అడవుల ఆవశ్యకతను ప్రతి ఒక్కరు గుర్తించాలి

భీమారం, న్యూస్‌టుడే : భూమిపై అడవుల ఆవశ్యకతను గుర్తించి ప్రతి ఒక్కరు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేంద్రీయ నర్సరీ, అటవీ ప్రాంతంలో నిర్వహించిన వనదర్శిని కార్యక్రమంలో పాల్గొని పాఠశాల విద్యార్థులకు మొక్కల గుర్తింపు, పెంపకం, వాటి ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. గ్లోబల్ వార్మింగ్‌తో కలిగే అనర్థాలను నివారించేందుకు అడవుల ఉపయోగాలు, వన్యప్రాణి సంరక్షణ వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో రత్నాకర్‌రావు, డీఆర్వో సుధాకర్, ఎఫ్‌బీవో బానేష్, పాఠశాల ఉపాధ్యాయులు మారయ్య, శ్రీనివాస్, కవిత, సుజన పాల్గొన్నారు.

ఎన్‌సీసీ అభ్యర్థుల ఎంపిక

మంచిర్యాల విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ప్రవేశాలకు ఎంపిక ప్రక్రియను శుక్రవారం చేపట్టారు. ఎన్‌సీసీ శిక్షణకు సంబంధించి 43 సీట్లు ఖాళీ ఉండగా 60 మంది విద్యార్థులు పోటీపడ్డారు. ఆదిలాబాద్ బెటాలియన్ నాయక్ సుబేదార్ కుల్దీప్‌సింగ్, హవల్దార్ బ్రిజేష్ కుమార్ డిగ్రీ కళాశాల మైదానంలో శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చాటిన 43 మంది అభ్యర్థులను ఎంపికచేశారు. ఇన్ఛార్జి ప్రిన్సిపల్ నరేందర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి జాడి మహేష్ పాల్గొన్నారు.


మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో తిరిగి సేవలు పునరుద్ధరించడంతో చికిత్స పొందుతున్న బాలింతలు

వైద్య సేవలు మొదలు!

వరద ముప్పు కారణంగా కొన్ని రోజులుగా మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో నిలిచిన సేవలు తిరిగి మొదలయ్యాయి. ఓపీ, ఐపీ విభాగాల్లో బాధితుల రద్దీ పెరిగింది. కాగా మొన్నటి వరకు జీజీహెచ్‌లో అందించిన పిల్లల వైద్యాన్ని సైతం నిపుణుల కొరత కారణంగా ప్రస్తుతం ఇక్కడి ఎంసీహెచ్‌లో అందించేలా ఏర్పాట్లు చేయడం విశేషం. ఇందుకు ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. గదులు, పడకల కొరత తోపాటు జ్వర బాధితులతో కిక్కిరిసి అస్తవ్యస్తంగా ఉండగా మొన్నటి వరకు ఎంసీహెచ్ సేవలు ఇక్కడే కొనసాగడం మరింత ఇబ్బందికరంగా మారింది. వర్షాలు తగ్గుముఖ పట్టడం, వరద బెడద లేదని తేలడంతో ఆయా కేంద్రాన్ని సొంత భవనానికి తరలించారు. ఇక వచ్చే వానాకాలం వరకు ఎలాంటి సమస్య లేకపోగా తరలింపు ప్రక్రియ ఇదే చివరిసారి అయ్యేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ**


ఎంసీహెచ్‌లో నూతనంగా ప్రారంభించిన పిల్లల ఓపీ గది

సంక్షిప్తం

■ **సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం**

మందమర్రి పట్టణం : కాకా వెంకటస్వామి జయంతి వేడుకల నిర్వహణపై ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయడంపై శుక్రవారం మందమర్రిలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. పట్టణ అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకుడు సుదర్శన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

■ **అక్రమ నిర్మాణం కూల్చివేత**

బెల్లంపల్లి పట్టణం: బెల్లంపల్లి పట్టణంలోని ఇంద్రానగర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్నారన్న సమాచారంతో అధికారులు అక్కడకు చేరుకుని జేసీబీతో నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు తప్పవని తహసీల్దార్ జ్యోత్స్న హెచ్చరించారు.

■ **అనుకున్న లక్ష్యం వైపు అడుగులు**

కాసిపేట: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, ఆ లక్ష్యంపై అడుగులు వేసి విజయం సాధించాలని మానసిక వైద్య నిపుణులు సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు లక్ష్యం ఎంచుకోవాలని సూచించారు. పరీక్షల పట్ల విద్యార్థులు భయాందోళన చెందవద్దన్నారు. ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు తదితరులున్నారు.

■ **వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలి**

లక్సెట్టిపేట: ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వైద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ **ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని వినతి**

దండేపల్లి: గిరిజనుల్లోని అన్ని తెగలు అభివృద్ధి చెందాలంటే ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని రాజ్‌గోండు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు కుమ్రం శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘ నాయకులతో కలిసి స్థానిక తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు పెందూర్ నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ **గోడప్రతుల విడుదల**

వేమనపల్లి: వేమనపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల గోడప్రతులను జిల్లాఅధ్యక్షుడు చరణ్ విడుదల చేశారు.

■ **మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు**

నస్పూర్: యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని నస్పూర్ ఎస్సై సుగుణాకర్ పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులు, పోలీసుల ఆధ్వర్యంలో గంజాయిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

■ **నిరుపేద ఆదివాసీలకు చేయూత**

కాసిపేట: పాత తిరుమలాపూర్, కొత్త తిరుమలాపూర్, భగవంత్‌గూడెంలోని ఆదివాసీ కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరకుల చొప్పున దేవాపూర్ ఓరియంట్ గోల్డ్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు సభ్యులతో కలిసి అందజేశారు.

■ **పంచాయతీ సిబ్బందికి వైద్యపరీక్షలు**

హాజీపూర్, నెన్నెల, జైపూర్: హాజీపూర్, నెన్నెల, జైపూర్ మండలాల్లోని పంచాయతీల్లో విధులు నిర్వహించే సిబ్బందికి శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. సిబ్బందిని పరీక్షించి మందులు అవసరమైన వారికి పంపిణీ చేశారు. డివిజినల్ పంచాయతీ అధికారిణి ధర్మారాణి, మండల వైద్యాధికారిణి లహరి, సిబ్బంది పాల్గొన్నారు.

■ **హామీల అమలుకు కృషి**

శ్రీరాంపూర్ గ్రామీణం: గుర్తింపు ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రవీంద్రఖని-న్యూటెక్ గని వద్ద మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధుల సహాయంతో లాభాల్లో వాటా 33 శాతానికి పెంచామన్నారు. సంస్థలో ప్రాతినిధ్య సంఘంగా యాజమాన్యంతో మెరుగైన ఒప్పందాలు చేసుకుంటున్నామని వివరించారు.

■ **దుస్తులు, పాదరక్షలు అందజేత**

దండేపల్లి గ్రామీణం: రెబ్బన్‌పల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు, పాదరక్షలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మంత్రి రాజు, సంస్థ డైరెక్టర్ యండి.షరీఫొద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ **దోమలతో సతమతం**

బెల్లంపల్లి పట్టణం: పట్టణంలోని బూడిదగడ్డబస్తీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు ఎలుక ఆకాష్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మురుగుకాల్వలు శుభ్రం చేయకపోవడంతో దోమలతో సతమతం అవుతున్నామని పేర్కొన్నారు.

■ **కొనసాగుతున్న ఆరోగ్యశాఖ తనిఖీలు**

మంచిర్యాల వైద్యవిభాగం, బెల్లంపల్లి పట్టణం: జిల్లా వ్యాప్తంగా వైద్యారోగ్యశాఖ చేపట్టిన తనిఖీలు కొనసాగుతున్నాయి. అయిదు బృందాలుగా ఏర్పడి అయిదు రోజులుగా నిర్వహిస్తుండగా శుక్రవారం మంచిర్యాల, బెల్లంపల్లిలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను పరిశీలించారు. పట్టణంలోని పీఓ కృపాబాయి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, డీపీఎంఓ రాఘవయ్య, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, వైద్యాధికారి రమ్యశ్రీ ఎనిమిది కేంద్రాలను తనిఖీ చేసి అనుమతి పత్రాలు, వైద్యుల వివరాలపై ఆరా తీశారు.

■ **కలమడుగు విద్యార్థులకు కంటి పరీక్షలు**

జన్నారం: కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మంచిర్యాలలోని ఆర్‌బీఎస్‌కె జిల్లా ఇన్‌ఛార్జి గౌరీశంకర్, ఆప్తమాలజీ టెక్నీషియన్ శంకర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం**

ఏసీసీ: ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న శ్రీరాంపూర్‌కు చెందిన మొబైల్ రిపేర్ షాప్ నిర్వాహకుడు శ్రీకాంత్ కుటుంబానికి మంచిర్యాల మొబైల్ రిపేర్ షాప్ యూనియన్ సభ్యులు రూ.50 వేలను శుక్రవారం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు జాకీర్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

■ **కాల్వపై నిర్మాణాలు తొలగింపు**

మందమర్రి పట్టణం: మందమర్రి మార్కెట్‌లోని దుకాణాల వెనుకాల డ్రైనేజీ కాల్వలపై అక్రమ నిర్మాణాలను శుక్రవారం పురపాలిక అధికారులు తొలగించారు. ఒకటి, రెండు చోట్ల మెట్ల నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

■ **కళాశాల ఏర్పాటుకు చర్యలు**

తాండూరు : వచ్చే విద్యా సంవత్సరం నాటికి తాండూరు మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శుక్రవారం తాండూరు మండలానికి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు మండలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు విషయమై ఎమ్మెల్యేను కలిశారు.